క్లుప్తంగా

ఉపాధి పనులను పకడ్బందీగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ రామన్న

సి.బెళగల్: ఉపాధి హామీ పనులను పకడ్బందీగా చేపట్టాలని ఏపీఓ రామన్న సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సభలలో తీర్మాణించిన పనులను పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలను తీసుకోవాలన్నారు.

సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గడివేముల: ఓర్వకల్లు మండలానికి బదిలీ అయిన తహసీల్దార్ విద్యాసాగర్‌ను బుధవారం రెవెన్యూ సిబ్బంది స్థానిక కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా నంద్యాలకు బదిలీ అయిన రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ భూర్గన్నను సన్మానించారు. కార్యక్రమంలో డీటీ గురునాథ్, వీఆర్వోలు నాయుడు, కృష్ణ, సామన్న, హరిచంద్ర, హరీంద్ర తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వర స్వామికి రుద్రాభిషేకం



భోగేశ్వరుడికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

గడివేముల: గడిగరేవుల గ్రామంలో కొలువైన దుర్గా భోగేశ్వర స్వామి సన్నిధిలో బుధవారం స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం, ఆరుద్రాష్టమి పురస్కరించుకుని స్వామివారికి ప్రధాన అర్చకులు శ్యాంసుందర్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు జలాభిషేకం, పాలాభిషేకం నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రం కావడంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.

దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి



దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కర్నూలు (రూరల్) : కల్లూరు అర్బన్ మండల బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ 108వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీన్ దయాల్ సేవలను బీజేపీ నాయకులు కొట్టె చెన్నయ్య గుర్తు చేశారు. కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగరాజు, రామ్మోహన్ రెడ్డి, దిలీప్ శర్మ, కల్లూరు అర్బన్ మండల ప్రెసిడెంట్ మీసాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను నిర్లక్ష్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం



కర్నూలు ఆర్‌డీఓ శేషిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

కర్నూలు (రూరల్) : రైతులను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. ఈ మేరకు బుధవారం రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కర్నూలు ఆర్‌డీఓ కార్యాలయం ముందు రైతు సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు అధ్యక్షతన ధర్నా నాయకులు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం అంటూ సమావేశాలు నిర్వహిస్తూ గొప్పలుగా ప్రచారం చేసుకోవడం తప్పా చేసిందేమీ లేదన్నారు. అనంతరం ఆర్డీవో శేషిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇ.తాండ్రపాడు సర్పంచ్ బాలపీరా, పంచలింగాల మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాసరెడ్డి, ఇస్మాయిల్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

పాణ్యం: పరిశుభ్రతతోనే ఆరోగ్యమని సర్పంచ్ మేకల పల్లవి అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం పాణ్యంలోని చెంచుకాలనీ ఆశ్రమ పాఠశాలలో గిరిజనులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవాలకు పొంచివున్న ముప్పు

- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- ఇప్పటికే వ్యాధులబారిన పడిన పశువులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పశువైద్యులు



ఓర్వకల్లులో ఎద్దుకు వైద్యం చేస్తున్న పశువైద్య సిబ్బంది(ఫైల్)

ఓర్వకల్లు: మూగజీవాలకు సీజనల్ వ్యాధుల ముప్పు పొంచివుంది. ఇప్పటికే సీజనల్ వ్యాధుల బారిని పడి పశువులు ఇబ్బందులు పడుతున్నాయి. వర్షాకాలంలో పశువులు సీజనల్ వ్యాధులకు గురవుతుంటాయి. ఈ సమయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా మూగ జీవుల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. ఈ సీజన్‌లో సంక్రమించే జబ్బులు సాధారణమైనవే అయినప్పటికీ పాడిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. వాటి కదలికలను గమనించకపోతే ఒక్కొక్కసారి ప్రాణనష్టం జరిగే అవకాశం లేకపోలేదు. ఓర్వకల్లు మండలంలో ఇప్పటికే పశువులకు సీజనల్ వ్యాధులు సోకినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశుపోషకులతోపాటు గొర్రెలు, మేకల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలంటున్నారు పశువైద్యులు. మూగ జీవులు పూర్తి ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నప్పుడు 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. మూగజీవాలకు సోకే సీజన్ వ్యాధుల లక్షణాలను పశువైద్యులు వివరించారు.

• గాలికుంటు వ్యాధిపై ప్రమాదకరం

తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి ఎక్కువగా సోకుతుంది. ఈ వ్యాధి భారిన పడిన పశువుల్లో శరీర ఉష్ణోగ్రత 104–105 డిగ్రీల వరకు పెరుగుతుంది. పశువు నోరు, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి, ఆహారం సరిగా తీసుకోలేవు. తద్వారా నీరసంగా మారి నడిచేందుకు కూడా ఇబ్బంది పడుతాయి. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. వ్యాధి నివారణకు యాంటి బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ వంటి మందులను వాడాలి.

• కలుషిత నీటితో జలగ వ్యాధి

మురుగునీరు, కాలువల్లోని కలుషిత నీటిని తాగడం వలన పశువులకు జలగ వ్యాధి సోకుతుంది. ముఖ్యంగా దూడలు, గొర్రెలు, మేకలు తదితర జీవాలకు ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి గురైనప్పుడు పశువులు మేత తినడానికి ఇబ్బంది పడుతాయి. వ్యాధి నివారణకు డిస్టోడిన్ 4 మాత్రలు, 100 లీటర్ల నియోజడ్ ఫ్లస్‌ను తాపించాలి.

• నట్టల వ్యాధి

వర్షాకాలంలో పశువులు పచ్చిమేత తిన్నప్పుడు నట్టల(నులిపురుగుల) సమస్యకు గురవుతాయి. ఈ వ్యాధి ఎక్కువ శాతం గొర్రెలు, మేకలపై ప్రభావం చూపుతుంది. వ్యాధితో గొర్రెల్లో ఎదుగుదల సక్రమంగా ఉండదు. జీవాలు తిన్న ఆహారమంతా నులి పురుగులే స్వాహాచేస్తాయి. దీంతో జీవాలు తరచూ రోగాల భారినపడే అవకాశముంది. ముందుజాగ్రత్తగా నట్టల నివారణ మందును తాపించాలి.

• చిటుకు వ్యాధి

వర్షాకాలంలో పశువులు ఎక్కువగా చిటుకు వ్యాధికి గురవుతాయి. ఈ వ్యాధి సోకిన పశువులు తీవ్ర జ్వరంతో బాధపడుతాయి. అధికశాతం ఈ వ్యాధి ఆగష్టు, సెప్టెంబర్ మాసాలలో వస్తుంది. పశుపోషకులు నిరంతరం అప్రమత్తంగా ఉండి, వాటి కదలికలను గమనిస్తూ ఉండాలి. వ్యాధి నివారణకు ఇటాస్ వ్యాక్సిన్ మందును వేయించాలి.

ప్రాణాంతకం గొంతువాపు వ్యాధి

పశువులకు సంక్రమించే వ్యాధులలో గొంతువాపు వ్యాధి ఒకటి. ఈ వ్యాధి అత్యంత ప్రమాదకరమైనది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి చొంగవస్తుంది. శ్వాస పీల్చడానికి తీవ్ర ఇబ్బంది పడుతుంటాయి. గొంతుకిందకు నీరుదిగడంతో గొంతువాపు వస్తుంది. వ్యాధితీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంటుంది. వ్యాధి వ్యాప్తి చెందకుండా పశువులను మంద నుంచి వేరు చేయాలి. నియంత్రణకు హెచ్ఎస్ టీకాలు వేయించాలి.

సకాలంలో చికిత్స చేయించాలి



రోగాల భారిన పడిన పశువులకు సకాలంలో వైద్య చికిత్స చేయించాలి. తరుచుగా పశువుల కదలికలను పరిశీలిస్తూ ఏ మాత్రం తేడా కనిపించినా వెంటనే సమీపంలో పశువైద్యాధికారులను సంప్రదించాలి. ఎప్పటికప్పుడు వైద్యం అందించాలి. గొంతువాపు, చిటుకు తదితర వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ వేస్తాం. పశుసంరక్షణపై ఎలాంటి సందేహాలున్నా పశువైద్య సిబ్బందిని సంప్రదించాలి.

– డా.మనోజ్ కుమార్, పశువైద్యాధికారి, ఓర్వకల్లు

అసభ్యకర ప్రవర్తన టీచర్లను శిక్షించాలి

కర్నూలు సిటీ: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే ఉపాధ్యాయులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఖండ, బి.మహేంద్రబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా తదితరులు బుధవారం డీఈఓ కాగిత శామ్యూల్‌ను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయులు వృత్తికే మచ్చ తెచ్చే విధంగా విద్యార్థినుల పట్ల వ్యవహరిస్తుండటం విచారకరమన్నారు. తల్లిదండ్రుల తరువాత గురువులదే స్థానమని, ఆ స్థానాన్ని నిలబెట్టుకోవాల్సిన కొందరు ఉపాధ్యాయులు సభ్యసమాజం చీదరించుకునే విధంగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. పెద్దకడబూరు ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాల టీచర్‌పై విచారణ చేసి, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖ అధికారులు ఘటనలు జరిగిన స్కూళ్లకు వెళ్లి విద్యార్థులకు ధైర్యం కలిగించే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఏజీఎంసీగా సుంకన్న

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ జిల్లా వృత్తివిద్యాధికారి కార్యాలయంలో జిల్లా స్థాయి అకడమిక్ గైడె న్స్ అండ్ మానిటరింగ్ సెల్ ఆఫీసర్‌గా గూడూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ లైబ్రరీ సైన్స్ లెక్చరర్ డాక్టర్ నాయకల్లు సుంకన్నను నియమిస్తూ ఇంట ర్మీడియెట్ బోర్డు రీజినల్ జాయింట్ డైరెక్టర్ రవినాయక్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీవీఈఓ వై.పరమేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇష్టారాజ్యంగా అధికారుల స్థానచలనం!

- బదిలీలలో లోపించిన పారదర్శకత?
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు
- వెలుగు సిబ్బందిపై బదిలీ వేటు

ఓర్వకల్లు: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఇతర జిల్లాలకు వెళ్లిన అధికారులను రెండు నెలల క్రితమే సొంత జిల్లాలో మండలాలను కేటాయించడం జరిగింది. అయితే ఆ బదిలీలు తాత్కాలికమేనని తెలుస్తుంది. ప్రస్తుత సాధారణ బదిలీల్లో ఇష్టరాజ్యంగా అధికారులకు స్థానచలనం కల్పించడం చర్చానీయాంశంగా మారింది. ఓర్వకల్లు మండలంలో పనిచేస్తున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్‌ను గూడూరు మండలానికి, ఆయన స్థానంలో డోన్ ఎంపీడీఓగా పని చేసిన శ్రీనివాసులును నియమించారు. ఇష్టారాజ్యంగా అధికారులకు స్థానచలం జరిగిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఒక్కరోజులోనే రెండు, మూడు ఉత్తర్వులు జారీ చేసిన సంఘటనలు ఇందుకు ఊతమిస్తున్నాయి.

• సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో..

ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న జయవాణిని ప్యాపిలి మండలానికి, అక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఎస్ఏఆర్ ఫైరోజ్‌ను ఓర్వకల్లుకు బదిలీ చేయడంతో ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. అలాగే ఇక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రాధను గూడూరుకు బదిలీ చేయగా, ఆమె స్థానంలో కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసిన కరుణను నియమించారు.

• దేవదాయ శాఖలో...

దేవదాయ, ధర్మదాయ శాఖలో ఓర్వకల్లు గ్రూప్ దేవస్థానంలో ఈఓగా పని చేస్తున్న తలారి మద్దిలేటిని సొంత మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానానికి బదిలీ చేయగా, ఆయన స్థానంలో యాగంటి ఈఓగా పని చేసిన చంద్రశేఖర్‌రెడ్డిని నియమించారు. కాల్వబుగ్గ ఈఓగా పనిచేస్తున్న డీఆర్‌కేవి ప్రసాద్‌ను యాగంటి ఈఓగా బదిలీ చేయడంపై విమర్శలకు తావిస్తుంది. గతంలో వీరు ముగ్గురు ప్రస్తుత బదిలీ స్థానాలలో ఈఓలుగా పని చేసిన విషయం తెలిసిందే. దీంతో వీరి బదిలీలు నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్లు విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుత బదిలీలలో పారదర్శకత లోపించినట్లు కొందరు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

• వెలుగు సిబ్బందిపై బదిలీ వేటు

వెలుగు ప్రాజెక్టులో క్లస్టర్ కోఆర్డినేటర్లు(సీసీ)గా పనిచేస్తున్నవారిపై కూడ బదిలీ వేటు వేయడం మరింత విమర్శలకు గురిచేస్తుంది. ఇక్కడ నన్నూరు క్లస్టర్ పరిధిలో పనిచేస్తున్న చెన్నయ్యను గడివేములకు, ఓర్వకల్లు క్లస్టర్ పరిధిలో పనిచేస్తున్న ముర్మనాయక్‌ను పెద్దకడుబూరుకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. కాల్వ క్లస్టర్‌లో పని చేస్తున్న స్వామన్నను కిష్టగిరి మండలాలకు బదిలే చేశారు. ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా చిరుగుద్యోగులుగా జీవనం సాగిస్తున్న వీరందరు ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. చిన్నపాటి వేతనంతో సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడంపై తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు.

ఘనంగా ఫార్మాసిస్టు దినోత్సవం



ఫార్మసీ విద్యార్థులు, సిబ్బందితో డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఫార్మసీ కళాశాలలో బుధవారం ఘనంగా ఫార్మసిస్టు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ హాజరై మాట్లాడారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫార్మాసిస్టుల పాత్ర చాలా ముఖ్యమైనదని చెప్పారు. ప్రజలకు మంచి సేవలు అందించి జిల్లాను ఆరోగ్య విభాగంలో ముందంజలో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూధన్‌శెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వకుంటే పనులు అడ్డుకుంటాం



కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు (రూరల్) : కర్నూలు–గుంటూరు జాతీయ రహదారి కోసం రెవెన్యూ అధికారులు సేకరించిన భూములకు పరిహారం ఇవ్వకపోతే పనులు అడ్డుకుంటామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ టీవీ రమేష్ బాబుకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పీడీ హుసేనయ్య, మండల నాయకులు రాఘవేంద్ర, మృత్యుంజయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు భాగస్వాములు కావాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (రూరల్) : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని, తద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బుధవారం కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామంలోని స్వచ్ఛతా హీ సేవా, ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన గ్రామ సభకు హాజరైన జిల్లా కలెక్టర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామంలో వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉంచేందుకు ఒక నిర్దిష్టమైన స్థలాన్ని ఏర్పాటు చేసుకుని అక్కడే చెత్త వేసేలా చూడాలన్నారు. నిరుపయోగంగా ఉన్న చెత్తను క్లాప్‌మిత్రల ద్వారా షెడ్‌కు తరలించి రీసైక్లింగ్ చేయించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని 9 మంది షెడ్ మిత్ర, క్లాప్ మిత్రలను జిల్లా కలెక్టర్ సన్మానించారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం అని 100 రోజుల్లో సాధించిన విజయాలను వివరిస్తూ ప్రతి ఇంటికి కరపత్రం అందించి స్టిక్కర్ అతికించడం జరుగుతుందన్నారు. 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా అప్పటికి మన గ్రామం, మండలం, జిల్లా అభివృద్ధి సమగ్రంగా సాధించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయడం వలన ప్రపంచ స్థాయిలో పోటీ తట్టుకునే విధంగా గ్లోబల్ సిటిజన్స్‌గా మారే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ కళ్యాణి, గ్రామ సర్పంచు భూపాల్‌రెడ్డి, ఎంపీపీ బోయ శారద, జిల్లాపరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డీపీఓ నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హడావుడి తప్ప... చేసిందేమీ లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ నారాయణ

కోడుమూరు రూరల్: గ్రామీణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించి హడావుడి చేశారే తప్పా ప్రజలకు చేసిందేమీ లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేవీ నారాయణ విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చి 100 రోజులు గడిచినా ఏ ఒక్క గ్రామ పంచాయతీకి కూడా ఒక్క రూపాయ ఇచ్చింది లేదని ధ్వజమెత్తారు. గ్రామీణులు తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, అధ్వానంగా మారిన రోడ్లుతో సతమతవుతున్నారుని ఆందోళన వ్యక్తం చేశారు. కోడుమూరు నుంచి వెల్దుర్తికి వెళ్లే రోడ్డంతా గుంతలమయంగా ఆధ్వాన్నంగా పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇకనైనా మంత్రి పవన్‌కల్యాణ్ ఊకదంపుడు ఉపన్యాసాలు మాని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గఫూర్ మియ్యా, స్థానిక నాయకులు వీరన్న, రాజు, మద్దిలేటి, రమేష్, శ్రీనివాసులు, లక్ష్మన్న, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

కర్నూలు (రూరల్) : రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం రూ.20 వేలు తక్షణమే అందజేయాలని రైతుసంఘం మండల కార్యదర్శి కృష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతుసంఘం ఆధ్వర్యంలో కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శివరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలన్నారు. జీవో నెంబర్ 22ను రద్దు చేయాలని, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, పర్లే నాగేషులు, కట్టాల వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలి

ఓర్వకల్లు: మండలంలోని వివిధ ప్రాంతాలలో నిర్మించిన విద్యుత్ టవర్లకు సంబంధించిన భూముల రైతులకు రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రీన్‌కో సంస్థ ప్రతినిధులు తమ స్వలాభాల కోసం పొలాల్లో విద్యుత్ టవర్లను నిర్మించడంతో రైతులు తీవ్రనష్టాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టవర్లను నిర్మించేటప్పుడు రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, గ్రామ సభలు నిర్వహించకుండా వారి ఇష్టానుసారంగా టవర్లు నిర్మించడం అన్యాయమన్నారు. ఒక్కో రైతు పొలంలో 50 సెంట్ల భూమిని రైతులు కోల్పోయారన్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం ఈ ప్రాంత భూములకు డిమాండ్ పెరగడంతో రైతులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా టవర్ల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు రూ.10 లక్షల వరకు పరిహారం చెల్లించాలని, లేని పక్షంలో రైతులను కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్, అయ్యన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హామీలను తక్షణమే అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

ఓర్వకల్లు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, అలాగే 2023 ఖరీఫ్‌లో పంట భీమా సొమ్మును చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఏపీ రైతు సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూదన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు పూర్తయినా ఇంతవరకు ఒక్క హామీని అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ముఖ్యంగా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలను చెల్లించాలన్నారు. రైతుల వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు అమర్చే ప్రక్రియను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ వెంకటరమణకు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మాసూంబాషా, బుగ్గరాముడు, వెంకటేశ్వర్లు, శివరాముడు, రామచంద్రుడు, దేవరాజు, మధు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



రైతులకు ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఓ మధన్‌మోహన్‌గౌడ్

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాల్లో బుధవారం ఏఓ మల్లేష్‌కుమార్‌తో కలిసి కోడుమూరు డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి మధన్‌మోహన్‌గౌడ్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓ రైతులకు వివరించారు. సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధ్యమన్నారు. ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని మధన్‌మోహన్‌గౌడ్ సూచించారు. కూరగాయలు, ఆకుకూరల పంటలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, చీడపురుగుల ఉధృతిని తెలుసుకునేందుకు లింగార్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈపీఈఓ వెంకటేష్, వీఏఏ మారెప్ప, శశికాంత్ రైతులు పాల్గొన్నారు.

ఉల్లిలో కుళ్లు తెగులును నివారించుకోవాలి



ఉల్లి సాగులో పాటించాల్సిన మెలకువలను వివరిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: అధిక వర్షాల మూలంగా ఉల్లి పంటకు కుళ్లు తెగులు సోకే ప్రమాదముందని ఉల్లి రైతులంతా అప్రమత్తంగా ఉండాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు.మండలంలోని వెంకటగిరి గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఏఓ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉల్లి సాగులో పాటించాల్సిన మెలకువలు, చీడపీడలు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఓ వివరించారు. తెగులు నివారణకు ఎకరాకు 500గ్రాముల చొప్పున కార్బడిజం పిచికారీ చేయాలన్నారు. అలాగే కంది పంట ప్రస్తుతం పూత దశకు చేరుకుంటున్న నేపథ్యంలో ఏదైనా పురుగు ఉంటే వెంటనే వేపనూనె, ఆస్పేట్ పిచికారీ చేసుకోవాలని ఏఓ సూచించారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ సుధాకర్

ఓర్వకల్లు: మండల పరిధిలోని కాల్వ, ఉప్పలపాడు గ్రామాలలో బుధవారం ఏఓ సుధాకర్ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సాగైన పంటలను ఏఓ పరిశీలించారు. పొగాకు అక్కడక్కడ ఆకుముడుత తెగుళ్లు సోకినట్లు గుర్తించారు. నివారణకు హెక్టారుకు 12–15 వరకు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ఇమ్మిడాక్లోప్రైడ్ 2.5 మి.లీ/థయామిథాక్సిమ్ 2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ హేమసుందర్‌రెడ్డి

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లో బుధవారం ఏఓ హేమసుందర్‌రెడ్డి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ప్రకృతి వ్యవసాయ వనరుల ఉపయోగం తదితర అంశాలపై రైతులకు ఏఓ అవగాహన కల్పించారు. అనంతరం మట్టి పరీక్షల పత్రాలను రైతులకు అందజేశారు.

ఆసుపత్రిలో సిబ్బంది లేకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం

పాణ్యం: మండల పరిధిలోని మద్దూరు పీహెచ్‌సీ ఆసుపత్రిలో సిబ్బంది లేకపోవడంతో ఎమ్మెల్యే గౌరు చరితా ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మద్దూరు పీహెచ్‌సీని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు పలు సమస్యలు విన్నవించారు. కుక్క కాటుకు మందు వేయాలని వచ్చిన వారిని నంద్యాలకు పంపుతున్నారన్నారని ఆరోపించారు. డాక్టర్లు అందుబాటులో ఉండని, ఎవ్వరు వచ్చిన నంద్యాలకు పంపుతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి వేలలలో ఆసుపత్రి ప్రాంగణంలో మద్యం సేవిస్తున్నారని, పట్టించుకునే నాథుడు కరువయ్యారని ప్రజలు తెలిపారు. దీంతో పక్కనే ఉన్న పుసులూరు గ్రామ ఆర్ఎంపీ వద్దకు రోగులు బారులు తీరుతున్నారన్నారు. ఆసుపత్రిలో మొత్తం 16మంది ఉండాల్సి ఉండగా కేవలం 6మంది మాత్రమే ఉండడపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. మహిళా డాక్టర్ ఉన్నప్పటికి అందుబాటులో లేకపోవడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు.